క్లుప్తంగా

బోరుమోటారు ఏర్పాటు



మోటారు ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని లింగ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.లక్షతో బోరు మోటారు ఏర్పాటు చేశారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహకారంతో మంజూరైన నిధులతో బోరుమోటారు ఏర్పాటు చేసి గ్రామస్తులకు తాగునీటిని అందించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేశ్, కోఆప్షన్ మాజీ సభ్యుడు గజానంద్, గ్రామస్తులు విఠల్ దశరథ్, మాధవ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు తనిఖీ



టికెట్లు పరిశీలిస్తున్న అధికారి ప్రకాశ్

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి వద్ద ఆర్టీసీ బస్సును అధికారులు తనిఖీ చేశారు. ఆదివారం మండలకేంద్రం నుంచి నిర్మల్ వైపునకు వెళ్తున్న బస్‌ను టీటీఐ అధికారి ఓమ్ ప్రకాశ్ ఆపి ప్రయాణికుల టికెట్లను పరిశీలించారు. తనిఖీ అనంతరం బస్ నిర్మల్ వెళ్లింది.

నేడు భీమన్న జాతర



గదలను గోదావరికి తీసుకెళ్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌లో సోమవారం జరిగే భీమన్న జాతరకు సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉదయం గ్రామంలోని భీమన్న ఆలయం నుంచి గదలను గంగాజలంతో అభిషేకం చేసేందుకు గోదావరికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మహిళలు భీమన్న గదలకు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆదివారం గంగస్నానం అనంతరం సోమవారం ఉదయం భీమన్న గదలను ఆలయానికి తీసుకొస్తారు. అనంతరం గదలకు ప్రత్యేక పూజలు చేస్తారు.

'హమాలీలకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి'

నిర్మల్‌చైన్‌గేట్: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న హమాలీలందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీలకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. బజారు హమాలీ, ప్రైవేట్ గోదాం హమాలీ, కూరగాయల మార్కెట్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీలకు కనీస పెన్షన్ రూ.10వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలైన వ్యవసాయ మార్కెట్‌యార్డు, ఎఫ్‌సీఐ, సివిల్‌సప్లై, టీజీబీసీయల్, ఎలక్ట్రిసిటీ స్టోర్లలో పని చేస్తున్న హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇల్లు లేని హమాలీలకు ప్రభుత్వం ఇందిర ఇళ్లలో ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

20న గంగాహారతి

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి వంతెన సమీపంలోని ఉమామహేశ్వర ఆలయం వద్ద ఈనెల 20న గంగాహారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉమ్మెడ గ్రామస్తులు తెలిపారు. గంగాహారతి కార్యక్రమానికి పలుగుట్ట రాములు మహారాజ్ హాజరవుతారని పేర్కొన్నారు. సాయంత్రం అన్నదానం ఏర్పాటు చేస్తామని.. ప్రజలు తరలిరావాలని కోరారు.

డ్రెయినేజీ నిర్మించరూ..



పారుతున్న మురికి నీరు

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో ఉన్న న్యూకాలనీలో మురికినీరు బీటీరోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు రాకపోకలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే అధికారులు.. డ్రెయినేజీలు నిర్మించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సరిహద్దులో ఆధ్యాత్మికత

- ఏటా కార్తికమాసం నుంచి హరినామ సప్తాహం
- ఐదు మండలాల్లో మద్యం, మాంసానికి దూరం ఉంటున్న ప్రజలు
- తులసీమాలలు స్వీకరిస్తున్న యువత



తానూరులో కీర్తనలు ఆలపిస్తున్న మహరాజ్



మొగ్లి గ్రామంలో ప్రవచనం వింటున్న భక్తులు

తానూరు: సరిహద్దు ప్రాంతాలైన తానూరు, కుభీర్, భైంసా, బాసర, ముధోల్ మండలాల్లోని పలు గ్రామాల్లోని ప్రజలు నేటికి మహారాష్ట్ర సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. ఏటా కార్తికమాసం నుంచి సుమారు ఆరునెలల వరకు గ్రామాల్లో ఆలయ వార్షికోత్సవాలు, అఖండ హరినామ సప్తాహం కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలు భక్తిమార్గంలో పయనిస్తున్నారు.

ముధోల్ నియోజకవర్గంలో..

భక్తుల కోరిన కోరికలు తీర్చే ఆలయంగా మహారాష్ట్రలోని పండరీపురంలో ఉన్న విఠలేశ్వరస్వామి మందిరానికి పేరుంది. ఈ ఆలయ సంస్కృతి, సంప్రదాయాలు..ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తానూరు, కుభీర్, భైంసా, బాసర, ముధోల్ మండలాల్లోని పలు గ్రామాల్లో కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో అధికంగా తులసీమాలలు స్వీకరించే పండరీపురం వార్కరి భక్తులు ఉంటారు. ఆలయ వార్షికోత్సవాలు, అఖండ హరినా మ సప్తాహం, శివనామ సప్తాహం కార్యక్రమాలు ఏడు రోజులు నిర్వహిస్తున్నారు. రోజు ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, గాత భజన, మధ్యాహ్నం భగవద్గీత, రాత్రి కీర్తన కొనసాగుతాయి. కార్యక్రమంలో పాల్గొన్న మహరాజ్‌లు భక్తిమార్గంపై పలు సూచనలు చేశారు. చెడువ్యసనాలకు దూరం ఉంటూ తల్లిదండ్రులను దేవుడితో సమానంగా చూడాలని ప్రవచనాలు బోధిస్తుంటారు.

కార్తికమాసం నుంచి ప్రారంభం..

కార్తికమాసం నుంచి గ్రామాల్లో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయి. సప్తాహం సందర్భంగా మహారాజ్‌ల ప్రవచనాలతో ఆధ్యాత్మికత పెరుగుతోందని భక్తులు పేర్కొంటున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు మద్యం, మాంసానికి దూరం ఉంటున్నారు.


భక్తిమార్గంపై ప్రవచనం



గ్రామాల్లో కార్తిక మాసం నుంచి సప్తాహం నిర్వహిస్తారు. వారం రోజులపాటు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రజలు సన్మార్గంలో వెళ్లేలా మహారాజ్‌లు ప్రవచనాలు బోధిస్తున్నారు.దీంతో యువకులు సైతం మద్యం, మాంసానికి దూరం ఉంటున్నారు.

– మనోహర్ మహరాజ్, సింగన్‌గాం

వార్కరిగా మారుతున్నారు



ఏటా హరినామ సప్తాహం నిర్వహిస్తుండటంతో గ్రామస్తులు వార్కరిగా మారుతున్నారు. యువకులు తులసీమాలలు స్వీకరించి మద్యం , మాంసానికి దూరం ఉంటూ భక్తి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీంతో గ్రామంలో ప్రశాంతత నెలకొంటొంది. సప్తాహంతో ఏడు రోజులపాటు పండుగ వాతావరణం నెలకొంటుంది.

– మాధవ్ మహరాజ్, నండ్‌గాం

ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారిపై రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే చాకలి ఐలమ్మ విగ్రహ నిర్మాణ పనులను ఆదివారం రజక కులసంఘం సభ్యులతో కలిసి మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పట్టణంలోని రోడ్డు డివైడర్ మధ్యలో విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్, శంకర్, నర్సయ్య, లింగన్న, రాజన్న, రాజేందర్, రాజశేఖర్, చంటి, రాజు, శ్యామ్, సాయి తదితరులున్నారు.

మాలమహానాడు సభను జయప్రదం చేయాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాల మహానాడు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని ఇంద్రనగర్‌లో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను సంఘం సీనియర్ నాయకులు రాచమల్ల రాజశేఖర్ ఆవిష్కరించారు. మాలలు ఐక్యమత్యంతో ఉండి.. వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రాజన్న, నేత శ్యామ్, ద్యావతి రాజేశ్వర్, పండుగ పెద్దులు, మ్యాదరి రాజేశ్వర్, సతీశ్, గంగాధర్, గంగేశ్వర్, శ్రీహరి, విక్రమ్, శేఖర్, అభిషేక్, సుమన్, సత్తయ్య, దాము తదితరులున్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు



మాదాపూర్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి, నాయకులు

సోన్: రైతులు తమ పంటను తక్కువ ధరకు దళారులకు విక్రయించి మోసపోకుండా.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటను అమ్ముకొని మద్దతు ధర పొందాలని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సామ భీంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు గంజాల్, పాక్‌పట్ల, మాదాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మంజులాపూర్ పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డితో కలిసి భీంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధర రూ.2300 తోపాటు సన్నరకాలకు అదనంగా బోనస్ రూ.500 చెల్లిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగాదాస్, డైరెక్టర్లు విజయ్, శేఖర్, మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రాజనర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మోహినుద్దీన్, గంగారెడ్డి, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో నసీరుద్దీన్



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ



ఖానాపూర్ : పాతఎల్లాపూర్‌లో ఇంటింటి సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో సునీత

తానూరు: ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీవో నసిరుద్దీన్ సూచించారు. ఆదివారం మండలంలోని కోలూరులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఈజీఎస్ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో కొనసాగుతోంది. ఆదివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో చేపడుతున్న సర్వేను ఎంపీడీవో రాధ పరిశీలించారు. కుటుంబసభ్యుల పూర్తి వివరాలు పక్కాగా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు.

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను ఆదివారం ఎంపీడీవో సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని సుర్జాపూర్, మేడంపల్లి, కొత్తవాడ, గోసంపల్లె, బావాపూర్(కే), పాతఎల్లాపూర్, దిలావార్‌పూర్, సేవ్యానాయక్‌తండా గ్రామాలు సందర్శించి సర్వే తీరును పరిశీలించారు. స్టిక్కర్ వేసిన ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. స్టిక్కర్ వేయని ఇల్లు ఉంటే.. స్టిక్కర్ వేసి సర్వే చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్‌రావు, కారోబార్ శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

'నారాయణ'లో జోనల్‌స్థాయి ప్రీమియర్ లీగ్



విద్యార్థులతో జీఎం గోపాల్‌రెడ్డి, శివాజీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని నారాయణ పాఠశాలలో జోనల్ స్థాయి ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. శనివారం రాత్రి విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, క్యారమ్ తదితర క్రీడలు నిర్వహించారు. ఈసందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణ నారాయణ పాఠశాలల జీఎం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ జోన్ ఏజీఎం శివాజీ, ఆదిలాబాద్ జోన్ ఏజీఎం ప్రసాద్, నిర్మల్ పాఠశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. అస్తవ్యస్తంగా పారిశుధ్యం



భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామంలో డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతోపాటు దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలను నిర్మించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, ఫోన్ : 83090 52136

గ్రూప్-4కు ఇద్దరి ఎంపిక



మౌనిక



రమాదేవి

లక్ష్మణచాంద: టీజీపీఎస్సీ గురువారం ప్రకటించిన గ్రూపు-4 ఫలితాల్లో ఇద్దరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన ఇందిర-ప్రభాకర్ దంపతుల కుమార్తె మౌనిక.. రాచాపూర్ గ్రామానికి చెందిన గుండారపు లక్ష్మీ-రాజేశ్వర్ దంపతుల కుమార్తె రమాదేవి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని గ్రామస్తులతోపాటు బంధుమిత్రులు అభినందించారు.

రెండు ఉద్యోగాలు సాధించిన యువతి



ప్రవళిక

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన సంద బుచ్చన్న-సురేఖ దంపతుల కూతురు ప్రవళిక ఇటీవల వెలువడిన గ్రూఫ్-4 ఫలితాల్లో ఉద్యోగం సాధించింది. కొద్దిరోజుల కిందట వెలువడిన డీఎస్సీ-2024 ఫలితాల్లో ఎస్జీటీగా కొలువు సాధించి మండలంలోని గోసంపల్లెలో విధులు నిర్వర్తిస్తుంది. తాజాగా గ్రూప్-4 ఉద్యోగం సాధించడంతో యువతిని పలువురు అభినందిస్తున్నారు.

'అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు'

ఖానాపూర్: అధికారంలోకి వచ్చిన అనతి కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మూసి ప్రాంత పర్యవేక్షణలో పాల్గొన్న మంత్రి ప్రజల సమస్యలు తె లుసుకొని సూచనలు చేయాలే.. తప్ప అడ్డుకుంటామనడం సరికాదని పేర్కొన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు తరలిరావడంతో ప్రాంగణం సందడిగా మారింది.

'ఏబీవీపీ నాయకుల అరెస్టు సరికాదు'



మాట్లాడుతున్న నర్సయ్య

కుంటాల: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య నేపథ్యంలో అక్కడికి వెళ్లిన ఏబీవీపీ నాయకులపై దాడి చేసి అరెస్టు చేయడం సరికాదని బీజేపీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కల్లూరు గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం కాకముందు గతంలో విద్యార్థుల సమస్యలపై ట్రిపుల్ ఐటీ గోడ దూకి విద్యార్థులకు మద్దతు తెలిపి నిరసన తెలిపిన విషయం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు సాయి సూర్యవంశీ, వెంకట్, లక్ష్మణ్‌పటేల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అపరిశుభ్రత



ఆసుపత్రిలోని బాలింతల వార్డు వద్ద చెత్తాచెదారం



ఆసుపత్రి చుట్టూ నిర్మించిన నాలాలో పేరుకుపోయిన పూడిక



ఆసుపత్రి లోపల గోడలపై ఉమ్మేసిన గుట్కాల మరకలు

జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఆసుపత్రిలోని గోడలు ఉమ్మేసినా గుట్కా, పాన్‌పరాగ్ మరకలతో దర్శనమిస్తున్నాయి. ఆసుపత్రి చుట్టూ నాలా తీయకపోవడంతో మురికి నీరు చేరి దుర్గంధం వెదజల్లుతుంది. బాలింతల వార్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయిన ఈగలు, దోమలకు అవాసంగా మారుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఒకే బోరు.. 13 కనెక్షన్లు



లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామంలోని ఓ వీధిలో ఉన్న బోరుకు 13 కనెక్షన్లు ఏర్పాటు చేసి ఇళ్లకు నీటిని సరఫరా చేసుకుంటున్నారు. ఒక్కసారి మోటార్ ఆన్ చేస్తే నాలుగు ఇళ్లలోకి సరిపడా నీళ్లు రావడానికి గంట సమయం పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి భగీరథ పైపులైన్ ద్వారా ఇంటింటికీ నీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్